దివ్యాంగులపై కక్షగట్టిన ప్రభుత్వం

- పింఛన్లలో భారీగా కోత
- దిక్కుతోచని స్థితిలో లబ్ధిదారులు

కొలిమిగుండ్ల: దివ్యాంగ పింఛన్‌దారుల పట్ల ప్రభుత్వం కనికరం చూపడం లేదు. ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చేందుకు పింఛన్ సొమ్ము పెంచుతామని హామీ ఇవ్వడంతో వారంతా ఆశ పడ్డారు. తీరా అధికారంలోకి వచ్చాక సాధ్యమైనంత వరకు లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. దివ్యాంగులు, మంచానికి పరిమితమైన వారిని సైతం వదిలిపెట్టడం లేదు. ఆరు నెలల క్రితం పింఛన్ల రీ-వెరిఫికేషన్ చేపట్టారు. తాజాగా నాలుగు రోజుల క్రితం పింఛన్ల తొలగింపునకు గురైన వారి జాబితాలు ఆయా గ్రామ సచివాలయాలకు చేరాయి. కొలిమిగుండ్ల మండలంలోని 16 సచివాలయాల పరిధిలో 140కి పైగానే దివ్యాంగులు, మంచానికి పరిమితమైన వారి పింఛన్లను తొలగించారు. ఈ ప్రకారం బనగానపల్లె నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 600 మందికి పైగానే పింఛన్లు కోతకు గురైనట్లు తెలుస్తోంది. ఎన్నో ఏళ్లుగా పింఛన్ తీసుకుంటున్న దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా పింఛన్లు తొలగించడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు.


అంకిరెడ్డిపల్లెలో పింఛన్ కోల్పోయిన దివ్యాంగుడు బాలకొండన్న

అంకిరెడ్డిపల్లెకు చెందిన బాలకొండన్న ఐదారేళ్ల నుంచి మంచానికే పరిమితమయ్యాడు. కుటుంబ సభ్యుల సాయం లేనిదే మంచినీళ్లు సైతం తాగలేని పరిస్థితి. అలాంటి వ్యక్తి పేరు పింఛన్ల జాబితా నుంచి తొలగించారని కుటుంబ సభ్యులు వాపోతున్నారు. బి.ఉప్పలూరుకు చెందిన లక్ష్మీదేవికి 2015లో పిడుగుపాటు వల్ల ఒక కన్ను దెబ్బతిని చూపు మందగించింది. ఆ సమయంలో ఉన్నతాధికారుల ఆదేశాలతో పింఛన్ మంజూరు చేశారు. ఆమెకు కూడా ప్రస్తుతం పింఛన్ రద్దు చేశారు. ఇలా పలు గ్రామాలకు చెందిన పదుల సంఖ్యలో అర్హులైన దివ్యాంగులు, మంచానికి పరిమితమైన వారిని అనర్హులుగా చేర్చడంతో వారంతా మండిపడుతున్నారు. సెప్టెంబర్ నెల నుంచి వీరందరికీ పింఛన్ దూరం కానుంది. త్వరలోనే ప్రభుత్వం పింఛన్ల దరఖాస్తుకు అవకాశం ఇస్తుందని అప్పుడు దరఖాస్తు చేసుకోవాలని ఉన్నతాధికారులు సెలవిస్తున్నారు. వస్తున్న పింఛన్‌ను రద్దు చేసి కొత్తగా దరఖాస్తు చేయడం ఏంటని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఎలాంటి ఆటంకాలు లేకుండా పింఛన్ సొమ్ము తీసుకుంటున్నామని కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తొలగిస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై త్వరలోనే దివ్యాంగులు ఆందోళన పట్టేందుకు సిద్ధమవుతున్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట


ధ్వజస్తంభాన్ని ప్రతిష్టిస్తున్న భక్తులు


జనార్ధన స్వామికి పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

కోవెలకుంట్ల: మండలంలోని సొదరదిన్నెలో జీర్ణోద్ధరణ గావించిన విష్వక్సేన, ఆంజనేయ, జనార్ధన స్వామి ఆలయాల్లో గురువారం విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పురాతన ఆలయాలు శిథిలావస్థకు చేరుకోవడంతో వాటిని పున:ప్రతిష్టించారు. మూడు రోజులపాటు ఏర్పాటు చేసిన ప్రతిష్ట కార్యక్రమాల్లో భాగంగా చివరి రోజు యంత్ర, విగ్రహ ప్రతిష్ట, శిఖర, ధ్వజ ప్రతిష్ట, ఆవాహిత దేవతా హోమం, బింబకళాన్యాసం, ప్రాణ ప్రతిష్ట, జలాధి హోమాలు, బలిప్రదానం, కూష్మాండబలి, గోదర్శన, పూర్ణాహుతి, తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, సొదరదిన్నె, వెలగటూరు, అమడాల గ్రామాల సర్పంచ్‌లు మధుసూదన్‌రెడ్డి, ఎల్వీ సుధాకర్‌రెడ్డి, బాల మద్దిలేటి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఎల్ఐసీ రామసుబ్బారెడ్డి, తదితరులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు

క్లుప్తంగా

వైభవంగా మద్దిలేటి స్వామి కల్యాణం

బేతంచెర్ల: మండలపరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శ్రావణ బహుళ షష్ఠి పురస్కరించుకొని శ్రీదేవి, భూదేవి సమేత మద్దిలేటి నరసింహ స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో వేదపండితులు జ్వాలా, కళ్యాణ చక్రవర్తి స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను కొలువుంచి, వేద మంత్రాలు చదువుతూ, గోవింద నామస్మరణలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణం జరిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం


అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

డోన్: స్థానిక వంద పడకల ప్రభుత్వాసుపత్రిలో గురువారం మండలంలోని బి.రామదుర్గానికి చెందిన రాజశేఖర్, సూర్యకాంతం దంపతులు రోగులు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు వారి సహాయకులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్ మాట్లాడుతూ.. సేవాభావంతో ప్రతిఒక్కరూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఇందుకు కృషిచేస్తున్న స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు జాన్ ప్రభాకర్‌ను ఆయన అభినందించారు. దాతల కుటుంబ సభ్యులు అఖిరానందన్, ధనుంజయ, తిరుపాల్ పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలకు ఆహ్వానం


జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న కార్యకర్తలు

కొలిమిగుండ్ల: త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో మీర్జాపురంలో నిర్వహించే కృష్ణాష్టమి వేడుకలకు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిని ఆహ్వానించారు. గురువారం కొలిమిగుండ్లలోని కార్యాలయంలో ఇందూ జ్ఞాన వేదిక ఉత్సవ కమిటీ సభ్యులు రామకృష్ణారెడ్డి, పీహెచ్‌ఎం నాయుడు, బాలు, భూపాల్ జెడ్పీ చైర్మన్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేసి పూజా కార్యక్రమాలకు హాజరు కావాలని కోరారు. 16 నుంచి 19వ తేదీ వరకు ప్రత్యేక పూజలు నిర్వహించి చివరి రోజు శ్రీకృష్ణుడి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఎట్ హోమ్‌కు ఆహ్వానం


తొగట సురేష్‌బాబు

డోన్: స్థానిక నెహ్రూనగర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న డాక్టర్ తొగట సురేష్‌బాబుకు పంద్రాగస్టు రోజున విజయవాడ రాజ్‌భవన్‌లో జరిగే ఎట్ హోమ్ కార్యక్రమానికి ఆహ్వానం అందింది. నంద్యాల జిల్లాలో విద్యావేత్తల విభాగంలో అత్యంత ప్రతిభ గల వ్యక్తిగా గుర్తించి ప్రభుత్వం తనకు ఈ గౌరవం కల్పించినట్లు హెచ్‌ఎం డాక్టర్ తొగట సురేష్ బాబు తెలిపారు. ఇందుకు సహకరించిన జిల్లా కలెక్టర్, డీఈఓలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ


సత్తా చాటిన విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం

కోవెలకుంట్ల: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటినట్లు హెచ్‌ఎం అరుణకుమారి తెలిపారు. ఆమె గురువారం మాట్లాడుతూ.. ఇటీవల తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పాఠశాలకు చెందిన రియా తబసుం, లీలామాధురి, ఆసియా బేగం సత్తా చాటి వెండి, రజత పతకాలు కైవసం చేసుకున్నారన్నారు. వారితో పాటు కోచ్ సుధీర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

పగలే వెలుగుతున్న వీధి దీపాలు

బనగానపల్లె రూరల్: గ్రామ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో గ్రామాల్లో పగటి పూట కూడా వీధిలైట్లు వెలుగుతున్నాయి. మండలంలోని అప్పలాపురం, కైప గ్రామాల్లో పలు వీధుల్లో ఎల్ఈడీ లైట్లు పగటి పూట సైతం వెలుగుతున్నాయి. వీధి లైట్లకు కొన్ని చోట్ల స్విచ్‌లు లేకపోగా మరికొన్ని చోట్ల స్విచ్‌లు ఉన్నా పగటి పూట ఆఫ్ చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని వీధిలైట్లకు ఆన్, ఆఫ్ స్విచ్‌లు ఏర్పాటు చేసి, పగటి పూట ఆర్పివేసేలా చర్యలు తీసుకోవాలని, ప్రజాధనం వృథా కాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉపాధి నిధుల దుర్వినియోగంపై ధ్వజం

- క్షేత్రస్థాయిలో కనిపించని మొక్కలు
- సిఫార్సు లేనిదే దక్కని యూరియా
- వాడీవేడిగా కోవెలకుంట్ల మండల మీట్

కోవెలకుంట్ల: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి అనుసంధానమైన ఉద్యాన తోటల సాగు నిధుల దుర్వినియోగంపై సభ్యులు ధ్వజమెత్తారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలమీట్‌లో ఉపాధి హామీ పథకంపై చర్చకు రాగా మండలంలోని బిజనవేముల గ్రామంలో మొక్కలు నాటకుండానే నాటినట్లు చూపి నిధులు స్వాహా చేశారని ఉపసర్పంచ్ భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. మరికొన్ని చోట్ల పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతులకు కాకుండా ఇతరులకు వర్తింప చేస్తున్నారన్నారు. గ్రామంలోని పలుచోట్ల పొలాల్లో కాకుండా కుంటలు, గుట్టలపై టెంకాయ మొక్కలు నాటడంతో అవి చనిపోయి నిధులు వృథా అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పథకానికి ఎంపిక చేసే సమయంలో భూమి సారాన్ని పరీక్షించి రైతులకు మొక్కలు అందజేస్తే ప్రయోజనం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అంశంపై ఉపాధి ఏపీఓ శ్రీకళ మాట్లాడుతూ.. తాను నాలుగు నెలల క్రితమే బాధ్యతలు చేపట్టానని, గతంలో మొక్కలు నాటడంలో ఏవైనా పొరపాట్లు జరిగి ఉంటే పరిశీలిస్తామని చెప్పారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండున్నర నెలలు కావస్తోందని మండలంలోని రైతులు వరి, మొక్కజొన్న పంటలను విస్తారంగా సాగు చేయగా యూరియా కొరత వేధిస్తోందని కలుగొట్ల ఎంపీటీసీ అబ్దుల్ సత్తార్ సభ దృష్టికి తెచ్చారు. సిఫారసు లేనిదే రైతులకు యూరియా అందటం లేదని, అధికార పార్టీ నాయకులు సూచించిన వారికే యూరియా బస్తాలు ఇస్తున్నారని సభ్యులు విమర్శించారు. మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నానో యూరియా, నానో డీఏపీ వాడకాన్ని ప్రోత్సహిస్తున్నాయని, ఈ కారణంగా కోటా సరఫరాలో 30 శాతం తగ్గించడంతో సమస్య తలెత్తిందన్నారు. త్వరలో మండలానికి 4,500 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని వెల్లడించారు. మండలానికి ఇప్పటి వరకు కేటాయించిన యూరియా, రైతులకు పంపిణీ చేసిన వివరాలు అందజేయాలని ఎంపీపీ రమాదేవి ఆదేశించారు.


మాట్లాడుతున్న ఎంపీపీ రమాదేవి

వైద్యంపై చర్చకు రాగా రేవనూరు పీహెచ్‌సీ డాక్టర్ మహబూబ్ సుభాని, విద్యపై ఎంఈఓ వెంకటసుబ్బయ్య ఆయా శాఖల ప్రగతిని వివరించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చొరవ చూపుతామని పేర్కొన్నారు. వైస్ ఎంపీపీ షాజహాన్, మండల కో-ఆప్షన్ మెంబర్ దిల్క్ బాషా, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ధరణికుమారి, ఈఓపీఆర్‌డీ ప్రకాష్‌నాయుడు, పంచాయతీరాజ్ ఏఈ చెంచయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుగుణ, వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నేడు బహుమతుల ప్రదానం

కొలిమిగుండ్ల: స్థానిక కస్తూర్బా పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు శుక్రవారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా బహుమతులు అందించనున్నారు. కొలిమిగుండ్లకు చెందిన రంగనాథ రెడ్డి, వనిత దంపతులు అనంతపురంలో ఓ కంపెనీలో ప్రాజెక్ట్ మేనేజర్, ప్రభుత్వ కళాశాల లెక్చరర్‌గా పని చేస్తున్నారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు పదో తరగతిలో ప్రతిభ చాటిన ముగ్గురు విద్యార్థినులకు ఒక గ్రాము బంగారు డాలర్‌తో పాటు నగదు బహుమతి అందజేయనున్నట్లు వెల్లడించారు.

300 అడుగుల జెండాతో ర్యాలీ


బేతంచెర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: స్వాతంత్య్ర సంగ్రామంలో దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరుల త్యాగాన్ని మరువకూడదని పలువురు వక్తలు అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని కొత్త బస్టాండు నుంచి ప్రధాన రహదారి వెంట హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. 300 అడుగుల జాతీయ జెండాతో సరస్వతి శిశుమందిర్ విద్యార్థులు, జ్ఞాన సరస్వతి కళాశాల ఇంటర్, డిగ్రీ విద్యార్థులు దేశ భక్తి నినాదాలు చేస్తూ, భారతమాత వేషధారణలో చెక్కభజన, ఘోష్ వాయిద్యాలతో ర్యాలీ నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజలతో పాటు ఆర్మీ ఉద్యోగులు, రోటరీ క్లబ్ సభ్యులు, వైద్యులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగుర వేయాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు జాతీయ జెండాలను పట్టుకుని భారతమాతకు జై అంటూ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రామసుబ్బారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.


జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

భక్తిశ్రద్ధలతో జియారత్ వేడుకలు

కోవెలకుంట్ల: పట్టణంలోని పెద్దబార్ ఇమాం, మండలంలోని సొదరదిన్నెలో గురువారం జియారత్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మొహర్రం పండుగ ముగిసి 40 రోజులు కావడంతో ఆయా చావిళ్లలోని పెద్ద బార్‌ఇమాం, బాదుల్లా స్వామి జార్తలను పురస్కరించుకుని పీర్లను ప్రత్యేకంగా అలంకరించారు. కోవెలకుంట్ల పట్టణంలోని ఆయా కాలనీలతో పాటు అమడాల, ముదిగేడు, వెలగటూరు, బిజనవేముల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై పీర్లకు ఫతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం చావిళ్ల వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.


కోవెలకుంట్లలో పెద్దబార్ ఇమాం పీరును ఊరేగిస్తున్న భక్తులు

రెగ్యులర్ ఉపాధ్యాయుడు లేక ఇబ్బందులు


విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న సీఆర్‌ఎంటీ ఉపాధ్యాయుడు

బనగానపల్లె రూరల్: మండలంలోని సంకలాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రెగ్యులర్ ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయులు గతేడాది బదిలీపై వెళ్లారు. ఈ ఏడాది జనవరి 2 నుంచి జూన్ 13వ తేదీ వరకు మండలంలోని రామక్రిష్ణాపురం ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయుడు పీఎండీ హుస్సేన్‌ను ఉన్నతాధికారులు డిప్యూటేషన్‌పై పంపారు. ఆయన కూడా ఇటీవల ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా కర్నూలుకు వెళ్లిపోయారు. తర్వాత జూలై 1 నుంచి ఎంఈఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఇల్లూరుకొత్తపేట క్లస్టర్‌కు చెందిన క్లస్టర్ రిజర్వు మొబైల్ టీచర్ (సీఆర్‌ఎంటీ) శివరామమద్దిలేటిని నియమించారు. తరచూ ఉపాధ్యాయులు మారుతుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, పాఠశాలకు రెగ్యులర్ ఉపాధ్యాయుడిని నియమిస్తే బాగుంటుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ పాఠశాలలో 11 మంది విద్యార్థులు ఉన్నారు. రెగ్యులర్ ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు బనగానపల్లె, నంద్యాల తదితర పట్టణాల్లోని ప్రైవేట్ స్కూళ్లలో చేరాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. సీఆర్‌ఎంటీలు అర్హత కలిగిన ఉపాధ్యాయులే అయినా వారికి కేటాయించిన క్లస్టర్ పరిధిలో పాఠశాలలకు సంబంధించి ప్రభుత్వ కార్యక్రమాల సమాచారాన్ని ప్రతి రోజు ఉన్నతాధికారులకు పంపాల్సి ఉంటుంది. వాటితో పాటు విద్యార్థులకు పాఠాలు బోధించాలంటే ఒత్తిడికి గురవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు పాఠశాలకు రెగ్యులర్ ఉపాధ్యాయుడిని నియమించాలని గ్రామస్తులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

శుభకార్యం

బేతంచెర్ల: అనంతపురం పట్టణంలోని జీఎంఆర్ గ్రౌండ్‌లో ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డి తనయుడు ప్రణయ్ రెడ్డి గురువారం జరిగింది. ఈ వివాహానికి మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. రంగాపురం గ్రామ నాయకులు యామసాని మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో నియామకం


అంబటి రవికుమార్‌రెడ్డి

బనగానపల్లె: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం బనగానపల్లె మండలం బత్తులూరుపాడు గ్రామానికి చెందిన అంబటి రవికుమార్ రెడ్డిని పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా నియమించారు.

యూరియా పంపిణీ

బేతంచెర్ల: మండలపరిధిలోని కొలుములపల్లె గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో గురువారం డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్యప్రకాశ్ రెడ్డి యూరియాను రైతులకు పంపిణీ చేశారు. మండలంలో యూరియా కొరత ఉండటంతో రైతుల విన్నపం మేరకు కలెక్టర్‌తో మాట్లాడి అదనంగా 20 టన్నులు మంజూరు చేయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సింగిల్ విండో చైర్మన్ చంద్ర శేఖర్, రైతులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

డోన్ టౌన్: ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు ఒంగోలు పట్టణంలో జరిగే సీపీఐ రాష్ట్ర 28వ మహా సభలకు కార్యకర్తలు, సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, సుంకయ్య, డోన్ పట్టణ కార్యదర్శి మోటా రాముడు పిలుపునిచ్చారు. స్థానిక నక్కి రామన్న భవన్‌లో గురువారం రాష్ట్ర మహా సభల పోస్టర్‌లను విడుదల చేశారు. మహా సభల్లో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, నూతన పరిశ్రమలు, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రత్యేక ప్యాకేజీలు, నిరుద్యోగ సమస్యతో పాటు రైతన్నలు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపారు.

- **బనగానపల్లె రూరల్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుతో పాటు ప్రజలకు ఇచ్చిన హామీల సాధన కోసం సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 23-25వ తేదీ వరకు ఒంగోలులో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా సమితి సభ్యులు సుబ్బారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా సెక్రటరీ శివబాలకృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో మండల కార్యదర్శి శివయ్య ఆధ్వర్యంలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు.

భక్తులకు వసతి కల్పన

శ్రీశైలంటెంపుల్: కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ స్కీమ్ ద్వారా హటకేశ్వరం, శిఖరేశ్వరం ఆలయాల వద్ద యాత్రికుల సౌకర్యాల కేంద్రాలలో శుక్రవారం నుంచి భక్తులకు వసతి కల్పించనున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఈఓ మాట్లాడుతూ భక్తుల వసతి కోసం రెండు బంకర్ బెడ్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఒక్కో బెడ్ రోజువారి అద్దె రూ.60 నిర్ణయించామన్నారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రెండు రోజులు విద్యుత్ కోతలు

డోన్ టౌన్: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకటాపురం ఫీడర్ కింద రూరల్ డెవలప్‌మెంటు ఆధ్వర్యంలో 11 కేవీ విద్యుత్ లైన్ పనులు జరుగుతున్నందున వెంకటాపురం, అబ్బిరెడ్డిపల్లె, గుమ్మకొండ, బొంతిరాళ్ల గ్రామాలకు ఈ నెల 16, 17 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నాగేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయానికి ఇచ్చే త్రీఫేస్ కరెంటు తెల్లవారుజామున 3 గంటల నుంచి 9 గంటల వరకు, మళ్లీ సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని వెల్లడించారు.

బనగానపల్లెలో..

బనగానపల్లె: స్థానిక 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఈ నెల 16న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మండలంలోని యనకండ్ల పలుకూరు నందవరం కైప పాత పాడు సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ మద్దిలేటి తెలిపారు.